క్లుప్తంగా

చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం



అర్చకులకు విరాళం అందజేస్తున్న చౌడం సదారమణ కుటుంబ సభ్యులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన చౌడం సదారమణ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం అందజేశారు. రూ.75 వేలు ఆలయాభివృద్ధికి, రూ.25వేలను నిత్యాన్నదానానికి విరాళంగా అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కామేశ్వరమ్మ తెలిపారు.

జూలై 29 నుంచి ప్రత్యేక లోక్ అదాలత్

డోన్ టౌన్ : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జూలై 29వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నామని మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసులు పరిష్కరించుకోవాలనుకునే వారు వివరాలతో మండల లీగల్ సర్వీసులో సమ్మతి తెలియజేయాలని తెలిపారు. సుప్రీం కోర్టులో అపరిష్కృతంగా ఉన్న కేసుల కక్షిదారుల సైతం ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



విద్యార్థికి పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్ : పాఠశాలలు పుఃన ప్రారంభం కావడంతో శుక్రవారం రెండవ రోజు విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కొనసాగింది. పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. మంచిగా చదువుకుని పాఠశాలకు గుర్తింపు తేవాలని హెచ్ఎం విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, సుబ్బరాయుడు, సంజీవరెడ్డి, భూకాంతరెడ్డి, బాబు, శ్రీనివాసులు, రఘునాథ్, రమేష్, విజయ్‌కుమార్, దేవేంద్రప్ప పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులతో హెచ్ఎం, ఉపాధ్యాయినులు

బనగానపల్లె రూరల్ : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థినులు (నేషనల్ మీన్స్ కం మెరిట్స్) ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు ఎంపికయ్యారు. 8వ తరగతి విద్యార్థినులు బి.ప్రవళిక, బొబ్బల పవనదేవవర్షిత, తలారి చంద్రగీతిక, సీబీ వైష్ణవీ, పి నాజ్మీన్, సి మధులత, ఎ.చంద్రిక, ఎస్ స్వలేహా, ఎస్ ప్రేమన్వితరెడ్డి బియల్ల సుప్రియా, ఎస్ అబిబాలు స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని హెచ్ఎం బాలగంగధర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ విద్యార్థినులకు 9వ తరగతి నుంచి ఏడాది రూ.12వేల ప్రకారం నాలుగేళ్ల పాటు ఉపకారవేతనాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. విద్యార్థినులను హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయినులు అభినందించారు.

పిడుగుపాటుతో ప్రమాదం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వినోద్, సూర్యనాగేష్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్అండ్‌బీ రహదారిలో గుళ్లదూర్తి గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం పిడుగుపాటుతో ప్రమాదం చోటు చేసుకుంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో గత పది రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఉయ్యాలవాడ మండలం కొత్తపల్లెకు చెందిన సూర్యనాగేష్, వినోద్, జహిరాబీ సొంత పనుల నిమిత్తం కోవెలకుంట్లకు వచ్చి బైక్‌పై తిరిగి స్వగ్రామం వెళ్తున్నారు. గుళ్లదూర్తి సమీపంలోని పొలాల్లో పిడుగు పడటంతో భయాందోళనకు గురికావడంతో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు బాధితులను చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ఆసుపత్రిలో చేర్పించారు.

సన్మానం

బేతంచెర్ల: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బేతంచెర్ల లైఫ్ యువనేత్ర సమితి సభ్యులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ సూపరిండెంట్ ప్రభాకర్ రెడ్డి, డీఎం హెచ్ఓ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అనంతపురం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల అమర్నాథ్ రెడ్డి, సలీం మాలిక్ చేతుల మీదుగా లైఫ్ యువనేత్ర సమితి సభ్యులైన రవి, షేక్షావలి, విజయేంద్రారెడ్డి, అబ్దుల్లా, జాకిర్, మణికంఠ, పవన్ కుమార్, యాసీన్ బాషను సన్మానించారు.



బలపాలపల్లెలో కాడెద్దులతో విత్తనాలు విత్తుతున్న రైతన్నలు



మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్న వ్యవసాయ కూలీలు

జోరుగా వ్యవసాయ పనులు



హెచ్ కొట్టాల గ్రామంలో ట్రాక్టర్‌తో విత్తనాలు వేస్తున్న దృశ్యం

బేతంచెర్ల : ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. జూన్ 1 నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవ్వగా వర్షాలు విస్తారంగా కురిశాయి. దీంతో వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీ అయ్యారు. జూన్ నెలకు ముందు అడపాదడపా వర్షాలు కురవడంతో రైతులు ముందస్తుగానే సేద్యం పనులు పూర్తి చేశారు. విత్తనాలు, ఎరువులు సైతం సిద్ధం చేసుకున్నారు. గత ఏడెనిమిది రోజులుగా కురిసిన వర్షాలకు భూమి పదును కావడంతో విత్తనంవేసే పనుల్లో రైతులు బిజీ అయ్యారు. అధిక శాతం వర్షంపైనే ఆధారపడిన బేతంచెర్ల మండలంలో విత్తనం విత్తే పనులు ఊపందుకున్నాయి. మండలంలో సుమారు 14.600 హెక్టార్ల సాగుభూమి ఉంది. ఖరీఫ్ సాగుకు సంబంధించి కంది, కొర్ర, వేరుశనగ, ఆముదం, ప్రొద్దుతిరుగుడు, సజ్జ, మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్నారు. ఎం. పేండేకల్లు, ముద్దవరం, బుగ్గానిపల్లె, ఆర్ఎస్ రంగాపురం, ఆర్‌కొత్తపల్లె, నాగమల్లకుంట, కొమ్మూరి కొట్టాల, గూటుపల్లె పొలాల్లో వ్యవసాయ కూలీలు, కాడెద్దుల సందడి నెలకొంది. కొందరు కాడెద్దులతో విత్తనం వేస్తుండగా మరికొందరు ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ పనులు ఊపందుకోవడంతో వ్యవసాయ కూలీలకు డిమాండ్ పెరిగింది.

ఘనంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారికి పల్లకీ సేవ శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారికి పల్లకీ సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య



రికార్డులను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య

అవుకు: వర్షాకాలం ప్రారంభమైందని, పాడి రైతులు, గొర్రెల పెంపకదారులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య పేర్కొన్నారు. మండల కేంద్రం అవుకుతో పాటు, గుండ్ల శింగవరం పశువైద్యశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. వ్యాక్సిన్, ఆర్టిఫిషియల్ ఇన్ సెమినేషన్, సెమెన్ స్టాక్ రిజిష్టర్‌లను ఆయన పరిశీలించారు. అలాగే ఏయే గ్రామాల్లో వ్యాక్సినేషన్‌లు పూర్తయ్యాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, పశుపోషకులకు సూచనలు చేయాలని సిబ్బందికి సూచించారు. పాడి పశువుల్లో గొంతువాపు వ్యాధి, జీవాల్లో చిటుక వ్యాధులపై పోషకులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే సిబ్బంది సమయ పాలన పాటించాలని, ఎల్లప్పుడూ ఆయా గ్రామాల్లోనే పశు పోషకులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో అవుకు పశువైద్యాధికారిణి భారతీదేవి, ఐశ్వర్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన డిప్యూటీ సీఎస్ఓలు



ప్యానల్ వీడియోను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎస్ఓలు యాదగిరి, నాగయ్య

డోన్ రూరల్ : స్థానిక రైల్వే స్టేషన్‌ను శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే ప్రధాన కార్యాలయం డిప్యూటీ సీఎస్ఓలు(ట్రాఫిక్, సిగ్నల్) యాదగిరి, నాగయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ట్రాఫిక్, సిగ్నల్స్ పాయింట్‌లను తనిఖీ చేశారు. భద్రతకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్టేషన్ మేనేజర్ కార్యాలయాన్ని సందర్శించి ప్యానల్ వీడియోను పరిశీలించారు. ఎక్కడ కూడ ట్రాఫిక్, సిగ్నల్స్ సమస్యలు లేకుండా చూసుకోవాలని రైల్వే స్టేషన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి

కోవెలకుంట్ల: ఆపదలో ఉన్న వ్యక్తులకు సకాలంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువకులు రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. రక్తవర్గాలను కనుగొన్న కార్ల్‌లాండ్‌స్టీనర్ జయంతిని రక్తదాతల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఆరోగ్యవంతులు ప్రతి మూడునెలలక ఓసారి రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణదాసు, శశాంక, రాజు, రాజశేఖర్, లక్ష్మీదేవి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవీయ విలువలు పెంచేవి ఇతిహాసాలు



గోపూజ చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మానవీయ విలువలు పెంచేవే భారతీయ ఇతిహాసాలు అని, సన్మార్గంలో నడిచేందుకు దోహద పడతాయని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకట రెడ్డి పేర్కొన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కర్నూలు శాఖ ఆధ్వర్యంలో మండలపరిధిలోని ముసలాయిచెర్వులోని రామాలయంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా ధార్మిక సభ శుక్రవారం జరిగింది. సామూహిక గోపూజ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భగవద్గీత ప్రచారకులు మద్దయ్యస్వామి చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో శ్రీవారి సేవకులు సోమేశ్వర్‌రెడ్డి, భజన మండలి అధ్యక్షుడు వెంకట కృష్ణారెడ్డి, సంజీవుడు తదితరులు పాల్గొన్నారు.



చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చేగువేరా జయంతి

డోన్ రూరల్ : స్థానిక నక్కీరామన్న భవనంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చేగువేరా 96 జయంతిని నాయకులు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేగువేరా త్యాగాలను ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రణత్‌యాదవ్, ప్రతాప్, వరదరాజులు, రంగస్వామి, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, మండల కార్యదర్శి ప్రదీప్ ఆధ్వర్యంలో శుక్రవారం చేగువేరా 91వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మండల నాయకులు మనోహర్,, హరి, వెంకటచారి, సాయి, చరన్, రాంబాబు, వినయ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్ : డోన్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అధికారులు ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి కోరారు. శుక్రవారం డోన్‌కు వచ్చిన ఆయన స్థానిక ఆర్అండ్‌బీ నూతన అతిథి గృహంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేకు పుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కంటే మెరుగైన అభివృద్ధికి పాటుపడాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : జాతీయ రహదారి 44బి. యు.కొత్తపల్లె వై జంక్షన్ నుంచి బేతంచెర్ల వరకు జరుగుతున్న పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. యు.కొత్తపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫీడర్ లైన్ షిఫ్టింగ్ పనుల నేపథ్యంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గుత్తి రోడ్డులోని ప్రభుత్వ నూతన వంద పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దొరపల్లె ఫ్యాక్టరీలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రైల్వే స్టేషన్, చిగురమానుపేట తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని ఆయన తెలిపారు.

ప్యాపిలి: ప్యాపిలి, పోతుదొడ్డి, పెద్దపొదిళ్ల సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వినయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి సబ్‌స్టేషన్‌లో నిర్వహణకు సంబంధించిన మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 11 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బనగానపల్లె రూరల్ : మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్లల్లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. పాతపాడు, పసుపల, బనగానపల్లె విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

యువకుడికి గాయాలు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం గ్రామానికి చెందిన యువకుడు సుమన్ ఇంటి నుంచి బస్టాండ్‌కు ప్రధాన రహదారిలో వెళ్తుండగా ఆళ్లగడ్డ నుంచి అవుకునకు వెళ్తున్న కారు ఆకుమల్ల సచివాలయ సమీపంలో ఢీ కొనింది. సుమన్ తలకు, కాళ్లకు రక్తగాయాలు అయ్యాయి. క్షతగాత్రున్ని వెంటనే ఆకుమల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అవుకువాసి రాయచోటిలో మృతి

అవుకు: అవుకు వాసి ప్రమాదవశాత్తు రాయచోటిలో శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం అవుకు చాకలిపేట వీధికి చెందిన కొక్కు శ్రీనివాసులు(32) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే లారీ బాడుగకు రాయచోటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో లారీపై తార్పల్ పట్ట కడుతుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్ గురై మృతి చెందాడు.

అంగన్‌వాడీ బడిబాట

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల పట్టణంతో పాటు సిమెంట్ నగర్ గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, సంతోషమ్మ, అనూష మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్వరరెడ్డి

డోన్ టౌన్ : స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు లింగ నిర్ధారణ చేసి ఆడ బిడ్డను గుర్తించి భ్రూణ హత్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ, భ్రూణ హత్యల నివారణ అడ్వైజరీ కమిటీ చైర్‌పర్సన్ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం భ్రూణ హత్యల నివారణ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణలకు పాల్పడితే పీసీపీఎన్‌డీటీ యాక్ట్ 1994 చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కమిటీ సభ్యులు కూడా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ ఆడ బిడ్డల సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల కమిటీ సభ్యులు డాక్టర్ నితీష్, న్యాయవాది మధుసూదనరెడ్డి, సామాజిక కార్యకర్తలు మహ్మద్ రఫీ, ఏఈ నాగరాజు, ఆరోగ్య విద్యాబోధకుడు రాఘవేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్

బనగానపల్లె రూరల్ : బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ తిరుపాల్ సూచించారు. శుక్రవారం మండలంలోని నందివర్గం పోలీసు స్టేసన్‌లో పీస్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. ఈ నెల 17వ తేదిన బక్రీద్ పర్వదినం ఉందని, హిందూ ముస్లిం సోదరులు స్నేహ పూరితంగా నిర్వహించుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఎలాంటి సంఘటనలు జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బక్రీద్ రోజు గోవధకు పాల్పడితే కఠిన చర్యలు

డోన్ రూరల్ : బక్రీద్ పండుగ రోజున గోవధకు పాల్పడితే కఠిన చర్యలు తప్పదని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.నాగరాజు హెచ్చరించారు. స్థానిక పశువైద్యశాలలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆవులు, వాటి దూడలను అమ్మేవారు, కొనేవారు కూడా చట్ట ప్రకారం నేరస్తులు అవుతారని హెచ్చరించారు.



ఇంద్ర ధనుస్సు కనువిందు!

డోన్ టౌన్: పట్టణ శివార్లలోని వెంకటనాయునిపల్లె రోడ్డులో శుక్రవారం సప్తవర్ణాల ఇంద్ర ధనుస్సు ప్రజలకు కనువిందు చేసింది. రెండు రోజులుగా వర్షం కురవడం నిలిచి పోయింది అనుకున్న ప్రజలకు సాయంత్రం ఒక్క సారిగా ఎండతో కూడిన చిరు జల్లులు కురిశాయి. ఈ సమయంలో ఆకాశంలో ఇంద్రధనుస్సు సప్తవర్ణాలతో వికసించి ఆకట్టుకుంది. ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేసింది.

ఉత్తమ సేవా పురస్కారం

బనగానపల్లె రూరల్ : కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన చేతుల మీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందుకునట్లు సేవ సమితి సెక్రటరీ పీబీ గణేష్‌యాదవ్ తెలిపారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా కర్నూలులోని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నంద్యాల జిల్లాలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసిన సొసైటీలతో పాటు రక్తదాన దాతలను సన్మానించారన్నారు.

చోరీ కేసు నిందితుడి అరెస్టు

ఆళ్లగడ్డ: దొర్నిపాడు మండలం డబ్ల్యూ కొత్తపల్లెలో ఇటీవల జరిగిన చోరీ కేసులో దొంగను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం డీఎస్పీ షర్ఫుద్దీన్ వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన భూమా బ్రహ్మనందరెడ్డికి డ్రైవర్‌గా వ్యవహరిస్తున్న యోగీశ్వరరెడ్డి వ్యసనాలకు బానిస కావడంతో పాటు అక్క పెళ్లికి రూ.4లక్షల వరకు అప్పులు చేశాడు. బ్రహ్మనందరెడ్డి ఇంట్లో నమ్మకంగా ఉంటూనే ఇంటి తాళాలు తీసుకొని బంగారు నగలు, రూ.50వేల నగదు చోరీ చేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అలా రెండుసార్లు దొంగతనానికి పాల్పడ్డాడు. అనుమానం రావడంతో భూమా బ్రహ్మనందరెడ్డి కుమారుడు భూమా సందీప్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. కారు డ్రైవరే నిందితుడిగా తేల్చారు. బంగారు డైమండ్ నెక్లెస్, మరో రెండు బంగారు నెక్లెస్‌లు, నాలుగు గాజులు, ఒక బంగారు డాలరు ఎత్తుకెళ్లాడు. అలాగే రూ.50వేల నగదు కూడా తస్కరించాడు. దొర్నిపాడు శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో అరెస్టు చేసి సుమారు రూ.18.20లక్షల విలువజేసే సొమ్ము, నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రూరల్ సీఐ హనుమంత్‌నాయక్, ఎస్ఐ సురేష్‌ను డీఎస్పీ అభినందించారు.

మౌలిక వసతులు కల్పించాలి

డోన్ రూరల్ : పట్టణంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జయరాంకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, పట్టణ కార్యదర్శి నారాయణ, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ వినతి పత్రం అందజేశారు. కాలనీలలో చెత్త, చెదారం పేరుకపోయి దుర్గంధంగా మారాయని ఈ సందర్భంగా వారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డోన్ మండల అధ్యక్షుడు విజయుడు, కొడయ్య తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు